
క్లుప్తంగా

వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుంది


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మున్సిపాలిటీ 2వ వార్డు ఈశ్వరాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ యువ నాయకుడు అనిల్‌కుమార్ తండ్రి మణి ఇటీవల మృతి చెందారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన కర్మక్రియల్లో పాల్గొన్న రోజమ్మ మణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనిల్ కుమార్ కుటుంబ సభ్యుల పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మధుర మీనాక్షిగా దేశమ్మ దేవత


మధుర మీనాక్షిగా దేశమ్మ దేవత

నగరి: పట్టణ పరిధిలోని నేత్ర ప్రదాయిని దేశమ్మ దేవాలయంలో ఆడినెల పూజల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ, ఆలయ కమిటీ వారు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా వివిధ సౌకర్యాలకు సంబంధిత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అమ్మవారికి మధుర మీనాక్షి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళ్లలో తీర్థం పోసుకున్నారు. ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మనీశ్వరస్వామికి ఆడినెల ప్రత్యేక పూజలు


మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పాత చెరువు కట్టకింద వెలసిన శ్రీమునీశ్వరస్వామి వారికి ఆదివారం ఆడి నెల పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్లు పెట్టి, స్వామివారికి కొత్త వస్త్రాలు, పూల మాలలతో ఊరేగించి, స్వామివారికి సమర్పించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మహిళలు తీసుకొచ్చిన పూజ సామగ్రితో స్వామివారిని సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. మొక్కుబడి ఉన్న మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గంగాధరనెల్లూరు: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వేల్కూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల మేరకు మండలంలోని వేల్కూరు దళితవాడకు చెందిన కుప్పయ్య(62) ఈ నెల 15వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనారోగ్యంతో బాత్రూంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కలవారు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుప్పయ్యకు పలు ఆరోగ్య సమస్యలు ఉండడంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం చేసి మృతదేహానిన బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడీ నెల్లూరు పోలీసులు తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి కృత్తిక పూజలు


యట్టేరి సుబ్రహ్మణ్య స్వామి

గంగాధరనెల్లూరు: ఆడినెల కృత్తిక నక్షత్రం సందర్భంగా మండలంలోని యట్టేరి గ్రామంలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత శివ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ధర్మకర్తలు, నిర్వాహకులు, ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో విశేష సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశేష పుష్పాలు ఆభరణాలతో అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కావిడి చెల్లింపులు జరిపారు. విచ్చేసిన భక్తాదులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబు మోసాలకే గ్యారంటీ


కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్ సీపీ శ్రేణులు, ప్రజలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: చంద్రబాబు మోసాలకే గ్యారంటీ అని మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆదివారం పుత్తూరులోని ఏడీకే కల్యాణ మండపంలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణితో కలసి ఆమె పాల్గొన్నారు. జగనన్న దిగిపోయే రోజుకి ఖజానాలో వేల కోట్లు ఉంచారని, అయితే చంద్రబాబు ఖజానా ఖాళీ అనడం అతని అవినీతి రాజకీయానికి పరాకాష్ట అన్నారు. బుర్రలేని పవన్‌కళ్యాణ్ చంద్రబాబు హామీలను నెరవేర్చకపోతే తాను ప్రశ్నిస్తానన్నాడని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆయన ఎక్కడ నిద్రపోతున్నాడో, ఏ షూటింగ్‌లో ఉన్నాడో ఎవరికీ తెలియదన్నారు. ఇంత విలాసవంతమైన డిప్యూటీ సీఎం దేశంలో ఎక్కడా ఉండరన్నారు. పుత్తూరులో తెలుగు యువత హరి గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారని, ఇతడు ఎమ్మెల్యే భానుకు ముఖ్య అనుచరుడని అన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న పుత్తూరులో గంజాయి వ్యాపారం చేయిస్తున్నారని ఆరోపించారు. నగరిలో పట్టుబడిన రేషన్ బియ్యం ప్రధాన సూత్రధారి అయిన అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడని తెలిపారు. ఈ ఇద్దరు నిందితులు ఎమ్మెల్యేతో కలిసి ఉన్న ఫొటోలను చూపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే భానుప్రకాష్ కరోనా సమయంలో కంటికి కనబడకుండా హైదరాబాద్‌లో దాక్కున్నాడని, తాను దగ్గరుండి ప్రజలకు సేవ చేశానని తెలిపారు. తన గురించి తప్పుగా మాట్లాడితే తోక కట్ చేస్తానని ఆమె ఎమ్మెల్యేను హెచ్చరించారు. పుత్తూరు నియోజకవర్గ కేంద్రంగా 30 ఏళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ముద్దుకృష్ణమనాయుడు ఎందుకు పాలిటెక్నిక్ కళాశాలను ఎందుకు కట్టలేక పోయారని ప్రశ్నించారు. మున్సిపల్ భవనాన్ని, మున్సిపల్ పార్కును ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారన్నారు. ముస్లింల కోసం షాదీ మహల్ ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. శ్మశానంలో ఎలక్ట్రికల్ క్రిమేషన్ షెడ్స్ ఎందుకు ఏర్పాటు చేయలేక పోయారన్నారు. మారుమూల ప్రాంతమైన నగరిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఎందుకు తీసుకు రాలేకపోయారని ప్రశ్నించారు. రూ.1346 కోట్లతో నేషనల్ హైవే రోడ్డు పనులు కూడా మంజూరు చేయించలేకపోయారని, ఇవన్నీ తాను చేయగలిగానని తెలిపారు. ఎమ్మెల్యే తండ్రి ఎందుకు ఇవన్నీ చేయలేకపోయారంటూ నిలదీశారు. గాలివాటంగా ఈవీఎంల పుణ్యంతో గెలిచాడని, ఈ విషయం నగరి ప్రజలందరికీ తెలుసునన్నారు. ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని చేయలేని ఎమ్మెల్యే తన గురించి మాట్లాడడం సరికాదని కడిగిపారేశారు. ఆదరించిన పార్టీకి వెన్నుపోటు పొడిచి, మరో వెన్నుపోటు పార్టీలో చేరిన ఓ వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాను కార్లో తిరుగుతున్నానని తు..తు..త్తూ.. అంటూ నత్తి నత్తిగా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. తాను 1991 నుంచి కార్లలో తిరుగున్నానని, తాను చేసిన తొలి సినిమా నుంచి హీరోయిన్‌గానే పనిచేశానని తెలిపారు.

మద్యాంధ్రప్రదేశ్ చేస్తున్న బాబు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే, ప్రస్తుత సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. పైపెచ్చు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. మాజీ మంత్రి రోజమ్మపై ఇక్కడి ఎమ్మెల్యే భాను అనుచిత వాఖ్యలు చేస్తే ఆమె రాజకీయాల నుంచి తప్పుకొంటారని భావిస్తున్నారని, అయితే ఆమె రాజకీయాల్లో ఉక్కు మనిషని, మళ్లీ నగరి నుంచి గెలిచి మంత్రి కావడం ఖాయమని అన్నారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, ఏకాంబరం, అన్నా లోకనాథం, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ అమలుపైనే కూటమి దృష్టి


మాట్లాడుతున్న గురవారెడ్డి

శ్రీరంగరాజపురం: వైఎస్ఆర్ సీపీలో బలమైన నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసులు పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలనను గాలికి వదిలి రెడ్‌బుక్‌పైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇరికించాలనే కుటిల బుద్ధితో మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయడం దారుణమన్నారు. రాజకీయ దురుద్దేశంతో లేని లిక్కర్ స్కాంను సృష్టించి తప్పుడు విచారణలు, అక్రమ కేసులు, అరెస్టులు చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని చేసినా రానున్న రోజుల్లో వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు.

విశ్వాస ఘాతకుడా రోజమ్మను విమర్శించేది?


మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

వడమాలపేట: విశ్వాస ఘాతకుడు, నమ్మకద్రోహి అయిన మురళిరెడ్డికి మాజీ మంత్రి రోజమ్మను విమర్శించే అర్హత ఉందా అంటూ స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు ప్రశ్నించారు. మాజీ మంత్రి ఆర్కే రోజాను ఉద్దేశించి మురళి రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వారు ఈ మేరకు స్పందించారు. గతంలో మురళిరెడ్డి తండ్రి సర్పంచిగా నిలబడి చిత్తుగా ఓడిపోయాడని, అలాంటి ఫ్యామిలీకి చెందిన ఆయన్ను ఎంపీపీగా, జడ్పీటీసీగా గెలిపించి రాజకీయ భిక్ష పెట్టారన్నారు. ద్రోహం చేసి, శత్రువులతో కలసి కుట్రలు చేసిన కుసంస్కారి అన్నారు. అనామకుడైనా పెద్దమనసుతో ఎంపీపీగా చేస్తే.. నక్క వినయం నటించి, భూకబ్జాదారుడిగా, దళితులను పేదలను హింసించే దుర్మార్గుడిగా పేరు గడించాడన్నారు. మురళీరెడ్డి ఆగడాలు మితిమీరిపోవడంతో బాటు, తెలుగుదేశం పార్టీ కోవర్టుగా పనిచేస్తున్నాడని మందలించడంతో ప్లేటు ఫిరాయించాడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సురేష్ రాజు, రాష్ట్ర యువత కార్యదర్శి గాంధీ, వైస్ ఎంపీపీ లోకేష్, సర్పంచ్ మంజుల, తులసీ, ఎంపీటీపీ ప్రమీల, కమల, నాయకులు నందయ్య, చంద్ర, ఉమాపతి, మునిబాబు, మండల యువత అధ్యక్షుడు భరత్, చంద్ర, వెంకటముని పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


బాధితులతో మాజీ మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర: వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి రోజా అన్నారు. ఆదివారం మండలంలోని మిట్టకండ్రిగ దళితవాడలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు రవి మృతి చెందాడు. అతని కర్మక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, మండల కన్వీనర్ వేణురాజు, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేరీ, నాయకులు మునికృష్ణారెడ్డి, మునిరాజ్, సెల్వం, అనిల్, గుణ, సుధాకర్, సత్య తదితరులు పాల్గొన్నారు.

బడుగు వర్గాలపై దాడులు దారుణం


కాలిపోయిన ఆటోను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: 20వ వార్డు వినాయకపురం ఎస్టీ కాలనీకి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు రాజయ్య ఆటోను రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే కాల్చివేశారని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆరోపించారు. ఆదివారం గ్రామానికి వెళ్లి కాల్చివేసిన ఆటోను పరిశీలించి, రాజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి ఇంటి వద్ద ఉన్న ఆటోను ఉద్దేశపూర్వకంగా కాల్చివేశారని తెలిపారు. టీడీపీ నాయకులు బడుగు, బలహీన వర్గాలను సైతం వదలిపెట్టకుండా దాడులు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బతుకు తెరువు కోసం ఆటో నడిపే శ్రమజీవి వైఎస్ఆర్ సీపీకి సానుభూతిపరుడుగా ఉండడమే నేరమా అని ప్రశ్నించారు. రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలపైనా దాడులకు పాల్పడుతూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామిక పద్ధతులు అవలంబిస్తున్న కూటమి నాయకులకు త్వరలో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


పన్నూరులో వైఎస్ఆర్ సీపీ నిరసన

ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి

విజయపురం: మహిళలను అసభ్యకరంగా దూషించిన ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయాలని పన్నూరు దళితవాడకు చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఆర్కే రోజాపై ఎమ్మెల్యే భాను చేసిన వాఖ్యాన్ని ఖండిస్తూ ఆదివారం పన్నూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ప్రజానాయకుడు బూతులు మాట్లాడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉండడానికి కూడా అర్హత లేదన్నారు. తన కంటే ముందుగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపొంది, మంత్రిగా ఆర్‌కే రోజా బాధ్యతలు చేపట్టి, నగరి నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. నోరు ఉందని ఇష్టం వచ్చినట్లు మహిళలను దూషిస్తే, రాబోయే ఎన్నికలలో సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సర్పంచ్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, ఆశీర్వాదం, ఆనందరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ


మొక్కలు నాటుతున్న అధికారులు

గంగాధరనెల్లూరు: మొక్కలు నాటడంతోనే వాతావరణ కాలుష్యం తగ్గి, ప్రజారోగ్యంపై సుస్థిరత ఏర్పడుతుందని ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ సూరిబాబు అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గంగాధరనెల్లూరులోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో సన్‌షైన్ గ్రానైట్ పరిశ్రమ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ వెంకటరెడ్డి, ఐపీఓ రామకృష్ణారెడ్డి, రమేష్ బాబు, సన్‌షైన్ గ్రానైట్ అధినేతలు డేవిడ్, చంద్ర పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ ఖూనీ


మాట్లాడుతున్న ఎంపీపీ హేమలతారెడ్డి

కార్వేటినగరం: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తోందని ఎంపీపీ మహాసముద్రం హేమలతారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక పెడదారిలో ఇబ్బందులు పెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్న కూటమికి రానున్న రోజుల్లో రెండింతలు ఎదురుదెబ్బ తప్పదని హెచ్చరించారు. రాజకీయ దురుద్దేశంతో అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి, అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇదే ధోరణితో వ్యవహరిస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు సురేష్ రెడ్డి, జడ్పీటీసీ దొరస్వామియాదవ్, గోవిందరెడ్డి, దూది మోహన్, కంచర్ల చక్రవర్తినాయుడు, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, గంధం ముని, పులిచెర్ల ఈశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, నరసింహారెడ్డి, చిరంజీవి రెడ్డి, ఉమాపతిరెడ్డి, ఎర్రపాండు, సుధాకర్‌రెడ్డి, భూపతినాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, విశ్వనాథం, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన యాజమాన్యం.. నాణ్యమైన ఫలసాయం


దానిమ్మ తోట


పుల్లయ్యగుండల్లో దానిమ్మ తోట

రైతన్నలు పలు పంటలు సాగు చేసి దిగుబడి అంతంత మాత్ర రావడంతో రైతులు పండ్ల తోటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. దానిమ్మకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని పలువురు రైతులు దానిమ్మ పంట సాగు చేస్తున్నారు. కొందరు మేలైన యాజమాన్య పద్ధతులతో పాటు పంటకు ఆశించే వివిధ పురుగులు, తెగుళ్లను సకాలంలో నివారించగలిగితే దానిమ్మ రైతు ఇంట సిరులు పండుతాయని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. దానిమ్మ సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను, సస్యరక్షణ చర్యలను ఆయన ఇలా వివరించారు. –పాలసముద్రం

- దానిమ్మ సాగులో మెళకువలు పాటిస్తే లాభాలు అధికం


ఢిల్లీప్రసాద్

• వాతావరణం

పొడి వాతావరణం అనుకూలం. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే చీడపీడల ఉధృతి అదేస్థానంలో ఉంటుంది. లోతైన, సారవంతమైన మురుగునీరు పోయే వీలుగల నేలలు చాలా అనుకూలం. గణేష్, మృదుల, భగువ అనే దానిమ్మ మొక్కలు అనువైనవి.

• మొక్క నాటే విధానం

నేల రకం, నేల స్వభావం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా 3.3 నుంచి 4.4 మీటర్ల దూరం ఉండాలి. 60.60.60 సెంటీమీటర్లు గుంతలు తీసి, 20 కిలోల పశువుల ఎరువు, కిలో సూపర్ ఫాస్ఫేట్, 2 శాతం లిండేన్ పొడిని మట్టిలో కలిపి గుంతలు నింపాలి.

• ఎరువులు వేసే విధానం

ఒక్కొక్క చెట్టుకు నాలుగు నెలల తర్వాత 125 గ్రాముల వేపపిండి. 5 కిలోల చివికిన పశువుల ఎరువు, ఏడు నెలల తర్వాత 250 గ్రాముల వేపపిండి 10 కిలోల చివికిన పశువుల ఎరువు, 11 నెలల తర్వాత 750 గ్రాముల వేపపిండి 10 కిలోల చివిక పశువుల ఎరువు వేసుకోవాలి. ఆ తర్వాత ప్రతి మొక్కకు సంవత్సరానికి 30 కిలోల పశువుల ఎరువు, 625 గ్రాముల నత్రజని, 250 గ్రాముల భాస్వరం, 250 గ్రాముల పొటాష్ దఫాలుగా మొదటి తడికి ముందు, తరువాత కాయ ఎదిగే దశల్లో వేయాలి. జింకు లోపమున్న ఆకుల పరిమాణం చిన్నదిగా ఉండి వంకర్లు తిరిగి ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ఐదు గ్రాముల జింకు సల్ఫేట్‌ను కలిపి 1–2 సార్లు కొత్త చిగురు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఫెర్రస్(ఇనుము)ధాతువు లోపించిన ఆకుల తెల్లబడును. నివారణకు గాను 2.5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

• కత్తిరింపులు

ప్రతి మొక్కకు బలంగా పెరిగిన నాలుగు కొమ్మలను కాండాలుగా ఉంచి మిగిలినవి కత్తిరించాలి. 2–3 సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ కొమ్మలను తగు రీతిగా పెంచి సరైన ఆకారం తీసుకురావాలి. నేలకు ప్రాకే కొమ్మలు, గుబురుగా పెరిగే కొమ్మలు, నీటి కొమ్మలను కత్తిరించాలి. చెట్లకు విశ్రాంతినిచ్చే సమయంతో చివరి కొమ్మలను 10–15 సెంటీ మీటర్ల పొడవు కత్తిరించాలి. కత్తిరించిన తర్వాత వచ్చిన చిగుర్లలో 2–3 ఉంచి మిగతావి తీసేస్తే బలంగా తయారై కొమ్మలపై పిందెలు ఏర్పడి కాయసైజు పెరుగుతుంది. చెట్టుకు 40–50 కాయలు ఉంచి మిగతావి తీసివేయాలి.

• పంట దిగుబడి

నాలుగు సంవత్సరాల తరువాత ఏటా ఒక్కో చెట్టు సగటున 100–150 పండ్లను ఇవ్వగలదు. పూత నుంచి పండు వరకు 5–6 నెలలు పడుతుంది. 5–2 మీటర్ల దూరంతో ఎకరాకు 400 చెట్లతో అధిక దిగుబడి పొందవచ్చు. తూర్పు, పడమరలో ఐదు మీటర్లు, ఉత్తర దక్షిణాలలో రెండు మీటర్లు ఉండేలా నాటు కోవాలి.

• తెగుళ్ల నివారణ

రోగ రహిత అంటు మొక్కలు నాటాలి. తెగులు ఆశించిన కొమ్మల భాగాలను అంగుళం కింది వరకు కత్తిరించి కాల్చివేయాలి. కత్తిరింపు సమయంలో వాడే కత్తెరలను ఒక శాతం సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంతో 30 నిమిషాలు నానబెట్టి ఉపయోగించాలి. వీటి కొమ్మలను కత్తిరించి, కాల్చివేయాలి. కత్తిరింపులు అయిన వెంటనే ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సెప్టెంబర్ మాసాలలో వచ్చే పూతను మాత్రమే పంటకు వదలాలి. రసాయన ఎరువులు అవసరానికి మించివేయరాదు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులతో పాటు, జింక్, బోరాన్, ఇనుము లాంటి సూక్ష్మధాతువులను వేయడంతో చెట్టుకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తెగులు సోకిన కాయలను ఎప్పటికప్పుడు పెరికి కాల్చి వేయాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే చెట్టుపై లీటరు నీటికి 200 మిల్లీ గ్రాములు ఆగ్రిమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్, మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. కాయతొలుచు పురుగు, బెరడు తినే పురుగు, తామర పురుగు, పేను బంక పురుగుల నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చు.

నెమలి వాహనంపై సుబ్రమణ్యేశ్వరుడు

తవణంపల్లె: మండల కేంద్రంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో రెండు రోజుల పాటు ఆలయ ధర్మకర్త ఎగువ తవణంపల్లె దామోదర్ రెడ్డి నేతృత్వంలో ఆడికృత్తిక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. శనివారం భక్తులు స్వామికి భరణి కావళ్లు చెల్లించారు. ఆదివారం ఆడి కృత్తిక సందర్భంగా భక్తులు కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రిలో సుగంధపరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన పల్లకిలో నెమలి వాహనంపై శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి కొలువుదీరి పురవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యమిచ్చారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత



చిత్తూరు అర్బన్: పార్కు సమీపంలో తప్పిపోయిన ఇద్దరు పిల్లలను పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. చిత్తూరు నగరం సంతపేటకు చెందిన ధనరాజ్ తన ఇద్దరు పిల్లలు యస్మిత, తనుశ్రీని ఆదివారం సాయంత్రం ఆడుకోవడానికి డీఆర్ పార్కుకు తీసుకొచ్చారు. ఇద్దరు పిల్లలు తప్పిపోయారు. డీఆర్ పార్కు సమీపంలో ఈ ఇద్దరు పిల్లలు ఏడుస్తూ కట్టమంచికి చెందిన భరత్‌రాజ్, గుణశ్రీ కంటపడ్డారు. వారు వెంటనే పిల్లలను పోలీసులకు అప్పగించారు. వారు నానమ్మ ఇంద్రాణికి అప్పగించారు.